# సమస్యలను పరిష్కరించాలి

- నివేదికలను సమన్వయంతో ఎలక్షన్ కమిషన్‌కు సమర్పించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ తనిఖీ



ఎన్నికల కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

పోచమ్మమైదాన్, అక్టోబర్ 25: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. సీ విజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, పరిష్కార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన 23 ఫిర్యాదులను పరిష్కరించినట్లు, 1950 ద్వారా 77 కాల్స్ వచ్చినట్లు కలెక్టర్‌కు అధికారులు వివరించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదునూ సంబంధిత అధికారి ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అలాగే, కంట్రోల్ రూమ్‌లో ప్రదర్శించిన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంసీసీ, ఎఫ్ఎస్టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ టీముల వివరాలు, సంప్రదించాల్సిన నంబర్లతో సహా ఉన్న వివరాలను ఆమె పరిశీలించారు. అన్ని విభాగాల నోడల్ బృందాలు నివేదికలను సమన్వయంతో సకాలంలో ఎలక్షన్ కమిషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కంట్రోల్ రూమ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి వాసు చంద్ర, పరిపాలన అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.



దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేస్తున్న 29వ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు

## 'దాస్యం' గెలుపు కోసం ఇంటింటా ప్రచారం

పోచమ్మమైదాన్, అక్టోబర్ 25: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మరోసారి దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని కోరుతూ 29వ డివిజన్ పాపాయిపేట, ఓఎస్‌నగర్‌లోని త్రిచక్ర పొదుపు సొసైటీ సంఘం ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా పింఛన్లు, షాదీముబారక్, కల్యాణలక్ష్మి తదితర పథకాలతో లబ్ధి పొందుతున్న వారి ఇళ్లకు వెళ్లి ఓటర్లను కలిసి కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం కో ఆర్డినేటర్ నార్లగిరి రమేశ్, కల్పలత సూపర్‌బజార్ వైఎస్ చైర్మన్ ఎండీ షఫీ, డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్, యూనియన్ అధ్యక్షుడు ఇసంపల్లి సంజీవ, మడికొండ బాబు, పసునూరి బాబు, గుండా రమేశ్, సాయిలు, రాచర్ల జగన్, గట్టు చందు, శ్రీరాముల సురేశ్, మాల్వ రాజు, క్రాంతి, భీమరాజ్, సతీశ్, చంటి, కరుణాకర్ పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా

## ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పోలీస్ సిబ్బంది చూడాలి

- వరంగల్ సీపీ అంబర్‌కిశోర్ ఝా
- హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ తనిఖీ

హసన్‌పర్తి, అక్టోబర్ 25: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా పోలీసు సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోలీసులు పూర్తిగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ధైర్యంగా ఓటు వేసేలా రక్షణ కల్పించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో పచ్చదనం పరిశుభ్రతను చూసి సీపీ మురిసిపోయారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ డెవిడ్‌రాజ్, సీఐ తుమ్మ గోపి, ఎస్సైలు అశోక్‌కుమార్, సురేశ్‌కుమార్, వలి, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'నరకాసురవధ ఏర్పాట్లకు సహకరించాలి'



నన్నపునేనికి వినతిపత్రం అందజేస్తున్న మరుపల్ల రవి

పోచమ్మమైదాన్, అక్టోబర్ 25: దీపావళి సందర్భంగా నిర్వహించనున్న నరకాసురవధ ఏర్పాట్లకు సహకరించాలని నరకాసురవధ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను కమిటీ అధ్యక్షుడు, 40వ డివిజన్ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నన్నపునేని మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వాహణకు సహకరిస్తానన్నారు. ప్రాచీన సంప్రదాయాలను భావితరాలకు తెలిపేందుకు ఇలాంటి ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఉత్సవ కమిటీ తరపున మైదానంలో విద్యుద్దీపాలు, బారికెట్లు, టెంట్లు, ఎల్ఈడీ, మైక్ సిస్టం, ఫైరింజన్, వైద్య శిబిరం ఏర్పాటు చేయించాలని, రోడ్లను మరమ్మతు చేయించి, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కనుకుంట్ల రవి, ఆవునూరి రామ్మూర్తి, వనం కుమార్, మరుపల్లి గౌతమ్, మాటేటి శ్యామ్, వంగరి సురేశ్, అన్న కుమారస్వామి, కుడికాల సాంబశివరావు, పోలెపాక మల్లేశం, దూడ కొమురెల్లి, తౌటం నరసింహ, కమ్ము రాజు, రంజిత్ పాల్గొన్నారు.

## వేణుగోపాలస్వామికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

పోచమ్మమైదాన్, అక్టోబర్ 25: వరంగల్ మట్టెవాడలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామితోపాటు అమ్మవార్లను బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. ఏకాదశి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు చేశారు. అలాగే, సాయంత్రం శ్రీవిష్ణు సహస్ర పారాయణం నిర్వహించారు. అంతేకాకుండా వేణుగోపాలస్వామికి మహిళా గోష్ఠికి వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులైనట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

## ఇంటర్నేషనల్ కురాష్ కోచ్‌గా నాగరాజు, నవ్యశ్రీ

కాశీబుగ్గ, అక్టోబర్ 25: కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన చందనగిరి నాగరాజు, నవ్యశ్రీకి ఇంటర్నేషనల్ కురాష్‌లో స్టార్-1 రిఫరీ అండ్ కోచ్ డిప్లొమా కైవసం చేసుకున్నారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ సహరాన్‌పూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఇంటర్నేషనల్ కురాష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిఫరీ సెమినార్, కోచెస్ కోర్స్ అండ్ ఎగ్జామినేషన్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాల క్రీడాకారులు, కోచ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుంచి నాగరాజు, నవ్యశ్రీ పాల్గొన్ని అత్యంత ప్రతిభ కనబర్చి డిప్లొమా సర్టిఫికెట్లు అందుకున్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి మహిళగా నవ్యశ్రీ ఈ డిప్లొమా సర్టిఫికెట్ పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని అసోసియేషన్ డైరెక్టర్ రవికపూర్, ఆల్ ఇండియా ప్రెసిడెంట్ రాజన్ వర్గీస్, విక్రాంతకుమార్ అభినందించారు.



సర్టిఫికెట్లు అందుకుంటున్న నవ్యశ్రీ, నాగరాజు

# జనగామ బీజేపీలో ముసలం

- బీరప్ప వర్గీయుల అసమ్మతి సమావేశం
- అభ్యర్థిని మార్చాలని పార్టీ రాష్ట్ర ముఖ్యనేతలను కలిసి వినతి

జనగామ, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : జనగామ నియోజకవర్గ బీజేపీలో ముసలం పుట్టింది.. తొలి జాబితాలో టికెట్ దక్కని బీసీ వర్గానికి చెందిన బేజాడి బీరప్ప వర్గీయుల్లో అసంతృప్తి సెగలు రగులుతున్నాయి. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఆయన టికెట్ ఆశించారు. అవకాశం దక్కకపోవడంతో అసంతృప్తితో రగిలిపోతున్న బచ్చన్నపేట మండలానికి చెందిన ఆయన వర్గీయులు, బీసీ కుల సంఘాల ముఖ్యనేతలు రహస్యంగా సమావేశమై అభ్యర్థిని మార్చాలని బుధవారం హైదరాబాద్ వెళ్లి రాష్ట్ర పార్టీ ముఖ్యులను కలిసి వినతిపత్రం అందజేశారు. పార్టీ విడుదల చేసిన మొదటి జాబితాలో జనగామ బీజేపీ అభ్యర్థిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి పేరును ప్రకటించింది. టికెట్ తనకే దక్కుతుందని ఆశలు పెంచుకున్న బేజాడి బీరప్ప వర్గీయులు నైరాశ్యానికి గురై రెండు రోజులుగా బచ్చన్నపేట మండలం తమ్మడపల్లిలో తన వర్గీయులతో అత్యవసర సమావేశం నిర్వహించుకున్నారు. బేజాడి బీరప్ప అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్టానం పునరాలోచన చేయాలని, సర్వే నివేదికల ఆధారంగా అభ్యర్థిగా ప్రకటించాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. పార్టీ అభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో బేజాడి బీరప్ప సేవలు చేస్తే.. లాబీయింగ్‌తో టికెట్ తెచ్చుకున్న దశమంత్‌రెడ్డికి కనీసం గ్రామాల పేర్లు, కార్యకర్తల బాగోగులు తెలవదని అధిష్టానానికి అందజేసిన లేఖలో పేర్కొన్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునే ప్రసక్తేలేదని బీరప్ప వర్గీయులు అధిష్టానం వద్ద కుండబద్ధలు కొట్టినట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జావడేకర్, బీజేపీ జనరల్ సెక్రటరీ సునీల్ బన్సల్, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ పేర్లతో కూడిన ఒక లేఖను బుధవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అందజేశారు. జనగామ నియోజకవర్గంలో అగ్రవర్ణాలకు పెద్దపీట వేస్తున్న తీరును కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో రెడ్లకు సీట్లు ఇచ్చిన సందర్భంలో బీజేపీలో బీసీ స్థానిక బిడ్డకు టికెట్ వస్తే అత్యధిక ఓటర్లు అయిన బీసీలు ఈ నియోజకవర్గంలో పార్టీ పక్షం ఉండే అవకాశం ఉందన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని రాష్ట్ర నాయకత్వం వదిలేసిందని పేర్కొన్నారు. చార్టెడ్ అకౌంటెంట్ వృత్తి నిపుణుడిగా ఈ ప్రాంత ప్రజానీకానికి సుపరిచితుడైన బీరప్పకు టికెట్ విషయంలో పునరాలోచించాలన్నారు. సర్వేలో ముందున్న వ్యక్తికి టికెట్ ఇవ్వకుండా బీజేపీ చారిత్రాత్మక తప్పిదం చేసిందని లేఖలో పేర్కొన్నారు. కార్యకర్తల అభీష్టానికి, సర్వే రిపోర్టులకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కార్యకర్తలకు ఆత్మహత్యా సదృశ్యం లాంటిది కూడా అందులో ప్రస్తావించారు.

### గన్‌పార్కు వద్ద నిరసన

బీజేపీలో కురుమలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆరోపిస్తూ తమ కులానికి చెందిన నాయకులకు టికెట్లు కేటాయించాలని బుధవారం కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద నిరసన తెలిపారు. సమితి రాష్ట అధ్యక్షుడు గొరిగె నర్సింహ కురుమ మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పిన బీజేపీ తమకు ఒక్క టికెట్ కూడా ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కురుమలకు టికెట్ల ఇవ్వకుంటే బీజేపీ సభల్లో నల్ల జెండాలతో నిరసన తెలుపుతామని హెచ్చరించారు.